సాక్షి ప్రకాశం

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024

గద్దెనెక్కి గప్‌చుప్



ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు గద్దెనెక్కి ఆరు నెలలైనా హామీలు అమలు చేయలేదు.

- 8లో..

తల్లిదండ్రులకు కడుపుకోత



పుల్లలచెరువు మండలం పీఆర్‌సీ తండాకు చెందిన ఆర్.ప్రవీణ్ నాయక్ (18) శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో చదువుకుంటూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28/25

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రేపు జాతీయ లోక్ అదాలత్

ఒంగోలు: జాతీయ లోక్ అదాలత్‌లో ఈనెల 14న జరిగే ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. రాజీకి అర్హత కలిగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువురి ఆమోదంతో పరిష్కరిస్తారని, న్యాయ స్థానాల్లో పెండింగ్ కేసులు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో తీర్పు అంతిమ తీర్పు అని, కోర్టుల్లో చెల్లించిన ఫీజు కూడా తిరిగి పొందవచ్చని చెప్పారు. ప్రీసిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాలు పరిష్కారానికి సంబంధిత న్యాయవాదులు సహకరిస్తారని పేర్కొన్నారు.

16 నుంచి సీఎల్ఐఎస్‌సీ పరీక్ష

ఒంగోలు సిటీ: ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు సర్టిఫికెట్ కోర్సు ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (సి.ఎల్.ఐ.ఎస్సీ–70 వ బ్యాచ్) పరీక్ష గుంటూరు, కడప పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యేవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి వారి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

● శ్రీలీలా వినోదం



సినీనటి శ్రీలీల గురువారం ఒంగోలులో సందడి చేశారు. సౌతిండియా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమెను చూసేందుకు అభిమానులు తరలివచ్చారు.

- వివరాలు 8లో ▶



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ ఇంత వరకు నెరవేర్చలేదు. గత ప్రభుత్వంలో ఠంఛనుగా అందిన రైతు భరోసా పథకం ఊసే లేకపోగా ఉచిత పంటల బీమా పథకానికీ మంగళం పాడింది. పెట్టుబడి సాయం అందక రైతులు అల్లాడుతున్నారు. అష్టకష్టాలు పడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక దళారుల చేత చిక్కి రైతులు విలవిల్లాడుతున్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు రైతు వ్యతిరేక చర్యలతోనే పాలన సాగిస్తున్నాడు. రైతులను దగాచేసిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు నేడు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేసి నిరసన గళం వినిపించేందుకు సన్నద్ధమవుతున్నాయి.

రైతులపై పగ కూటమి దగా

పంటల బీమా ప్రీమియం ఇలా..					
పంట పేరు:	వరి	వేరుశనగ	మొక్కజొన్న	పెసలు	మినుములు
రైతు వాటా ప్రీమియం (ఎకరాకు):	రూ.630	రూ.480	రూ.570	రూ.300	రూ.300
బీమా మొత్తం:	రూ.16 వేలు	రూ.32 వేలు	రూ.38 వేలు	రూ.20 వేలు	రూ.20 వేలు



అనుమనపల్లెలో ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన పప్పుశనగ పంట (ఫైల్)

- ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిన చంద్రబాబు
- అందని పెట్టుబడి సాయం..
- ఉచిత పంటల బీమాకు మంగళం
- ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కక దళారుల చేతుల్లో రైతుల విలవిల
- రైతులకు భారంగా మారిన పంటల బీమా ప్రీమియం
- గత వైఎస్సార్ సీపీ పాలనలో జిల్లాలో రైతు భరోసా కింద రూ.1634.85 కోట్ల సాయం
- అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ
- చంద్రబాబు నయవంచనపై నేడు ఒంగోలులో మహా ధర్నా

ఒంగోలు సబర్బన్: రైతులను వంచించటం చంద్రబాబుకు కొత్తేమీ కాదు.. అధికారంలోకి రాకముందు ఒకమాట.. అధికారం చేపట్టిన తరువాత మరో మాట మాట్లాడటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఏరు దాటే దాకా ఓడమల్లన్న, ఏరు దాటిన తరువాత బోడి మల్లన చందంగా ఉంటుంది చంద్రబాబు నైజం. 2024 ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను ఒక పక్క మోసం చేస్తూనే మరో వైపు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు, సానుభూతిపరులపై కేసులు పెట్టుకుంటూ కక్షసాధింపు చర్యలతో పాలన కొనసాగిస్తున్నాడు. చంద్రబాబు ఇన్ని అకృత్యాలు చేస్తున్నా కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీల నాయకులు కూడా పన్నెత్తి మాట అనటం లేదు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు పూర్తయింది. అయినా ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా అందలం ఎక్కించిన జనాలను నిలువునా మోసగిస్తున్నారు.

ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఏదీ..

2024 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రతి రైతుకు ఏడాదికి వ్యవసాయ పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఖరీఫ్ సీజన్ పూర్తయింది. రబీ సీజన్ ప్రారంభమైంది. కానీ పెట్టుబడి సాయం చేస్తానని చెప్పిన మాటలు మాత్రం విస్మరించారు. దాంతో పాటు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తానని ఎన్నికల హామీల్లో పొందుపరచటమే కాదు, బహిరంగ సభల్లో, ఉపన్యాసాల్లో ఊదరగొట్టారు. కానీ జిల్లాలో పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక ఖరీఫ్‌లో ముందుగా సాగు

జిల్లాలో మొత్తం రైతులు:	2,84,113
వైఎస్సార్ సీపీ హయాంలో రైతు భరోసా కింద ఇచ్చిన నగదు:	రూ.1634.85 కోట్లు

చేసుకున్న రైతులు ధాన్యాన్ని తెగనమ్ముకుంటూ దళారుల చేతుల్లో విలవిల్లాడుతున్నారు. క్వింటా రూ.1650 కి అమ్ముకోవాల్సి ఉంటే రైతులు రూ.1200 నుంచి రూ.1300 మధ్యలో అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది. అంటే క్వింటాకు రూ.300 నుంచి రూ.400 వరకు రైతులు నష్టపోతున్నారు. అయినా ప్రభుత్వం మాత్రం కళ్లులేని కబోదిలా వ్యవహరిస్తోంది. దాంతో రైతులు కూటమి ప్రభుత్వ పాలన చూసి రగిలిపోతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉంటే ఇప్పటికే ప్రతి రైతుకు రూ.10 వేలు అందేది..

అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉండి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అయి ఉంటే జిల్లాలోని ప్రతి రైతుకు ఇప్పటికే రూ.10 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందేది. రైతు భరోసా పథకం–పీఎం కిసాన్ కింద జిల్లాలోని రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే జూన్ నెలలోనే మొదటిసారి పెట్టుబడి సాయం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేది. నవంబర్ పూర్తయ్యేలోపు అంటే రబీ సీజన్ ప్రారంభ సమయంలోనే పెట్టుబడి సాయం అందేది. అంటే మొత్తం మీద నవంబర్ పూర్తయ్యేసరికి దాదాపు మూడు విడతలుగా రూ.10 వేలు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేవి. ప్రతి ఖరీఫ్ సీజన్ 2,84,113 రైతు కుటుంబాలకు రైతు భరోసా పథకం కింద, రబీ సీజన్‌లో 3.10 లక్షల మందికి కూడా రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 చొప్పున వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అందుతూ వచ్చేవి. ఆ విధంగా 2019 నుంచి 2023 వరకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.1634.85 కోట్లు జిల్లాలోని రైతులకు ఇచ్చారు. మరి అంతకంటే ఎక్కువ ఇస్తానన్న చంద్రబాబు ఖరీఫ్, రబీ సీజన్ పూర్తి కావస్తున్నా అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా రైతుల ముఖం కూడా చూడటం లేదు. 2023లో జిల్లాలో ఖరీఫ్ లక్ష్యం 2.03 లక్షల హెక్టార్లు, 2023–24 రబీ లక్ష్యం 1.16 లక్షల హెక్టార్లు ఉంది. 2024–25 రబీ లక్ష్యం 2.39 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1.02 లక్షల హెక్టార్లలోనే సాగైంది.

బీమా భారం రైతులపైనే..

అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల్లో పంటలు నష్టపోతే వారిని ఆదుకునేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంటల బీమా ప్రీమియంను రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లించేది. అలాంటిది చంద్రబాబు ఆ పథకాన్ని ఎత్తేసి బీమా ప్రీమియంను రైతుల నెత్తిన రుద్దాడు. చేసేదిలేక రైతులే పంటల బీమా ప్రీమియం సొమ్మును ఇన్సూరెన్స్ కంపెనీలకు కడుతున్నారు. సాగుఖర్చులకే డబ్బులు లేక అవస్థలు పడుతున్న రైతులకు బీమా ప్రీమియం చెల్లింపు మరింత భారంగా మారింది. నవంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు తోడు, ఈనెల కురిసిన ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. ఫెంగల్ తుఫాన్‌తో జిల్లాలో 10,336 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని చెప్పడంతో చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించలేకపోయారు. దీంతో వారికి పంటనష్ట పరిహారం కూడా అందే పరిస్థితి లేదు.

ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలపై గళమెత్తిన వైఎస్సార్ సీపీ

కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలను నిరసిస్తూ రైతులకు అండగా ఉండేందుకు వైఎస్సార్ సీపీ గళమెత్తింది. జిల్లాలోని రైతులు, రైతు సంఘాల నాయకులతో కలిసి జిల్లా కేంద్రం ఒంగోలులో కలెక్టరేట్ ముందు నేడు ధర్నాకు పూనుకుంది. చంద్రబాబు నయవంచనను ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు.

రైతులకు భరోసా కరువు



పొలంలో వేసిన మినుము పంట ఎండిపోయింది. వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు. నష్టపరిహారం అందుతుందో లేదో తెలియని పరిస్థితి. రైతులకు గత ప్రభుత్వంలో పంటల బీమా, పంట నష్టపరిహారం అందుతుండటంతో కొంత వరకు ఆర్థిక ఇబ్బందులు తప్పేవి. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితులు లేక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– వరికుంట్ల పెద్దకోటేశ్వరరావు, రైతు, రావిపాడుగ్రామం, కంభం మండలం

కూటమి ప్రభుత్వంలో రైతులకు మొండి చెయ్యి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు, పంటల బీమా, పంట నష్ట పరిహారం డబ్బులు పడేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా డబ్బులు పడలేదు. అసలు ఎప్పుడు పడతాయో అధికారులకే తెలియడం లేదు. సరైన సమయంలో వర్షాలు లేక రైతులు కరువుతో అల్లాడుతున్నారు.

– గొంగటి చిన్నరామిరెడ్డి, రైతు, జంగంగుంట్ల, కంభం మండలం

ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు



రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రభుత్వ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా రైతులు పండించిన పంటలో 30 శాతం పంటని రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసింది. మిగిలిన పంటలో రైతుకు లాభాలు వచ్చేవి. ప్రభుత్వం కొన్న సరుకుని గోడౌన్లలో నిల్వ ఉంచి మార్కెట్‌లో ధర వచ్చినప్పుడు ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. ఈ విధానం వల్ల జగన్ పాలనలో స్వర్ణయుగంగా ఉండేది. ఏ రోజు రైతు రోడ్డు ఎక్కలేదు. అందుకు భిన్నంగా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయి.

– మారెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పొగాకు బోర్డు మెంబర్

10 ఎకరాల పంట నష్టపోయాను



నేను 10 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాను. ఒక్కొక్క ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. పప్పుశనగ సాగు చేసిన నెల రోజులకే అకాల వర్షాలు రావడంతో 10 ఎకరాల్లోని పంట పూర్తిగా నష్టపోయాను. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలని వేడుకుంటున్నా.

– సూరా గురువారెడ్డి, పోసుపల్లె గ్రామం, కొమరోలు మండలం

రైతుల గోడు పట్టని ప్రభుత్వం



ఎన్నికలకు ముందు రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు ఇప్పుడా విషయాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. సూపర్ సిక్స్ లో రైతు భరోసా చాలా కీలకమైన హామీ. 6 నెలలు గడుస్తున్నా వాటి గురించి మాట్లాడటం లేదు. జిల్లాలో రైతులు ఈ ఏడాది అతివృష్టితో ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అన్నదాతలను ఆదుకోవాలి.

– కంకణాల ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఒంగోలు

ఆరు నెలలకే కూటమి అట్టర్‌ఫ్లాప్



వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ప్రకాశంజిల్లా రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి , పక్కన దద్దాల, వేదికపై శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

- దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్: కారుమూరి
- ఈవీఎంపై అందరిలో అనుమానాలు: చెవిరెడ్డి
- అన్ని వేళలా అండగా ఉంటాం: బూచేపల్లి

కనిగిరి రూరల్(పామూరు): రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ పాలన అన్ని రంగాల్లో ఆరు నెలలకే అట్టర్ ఫ్లాప్ అయిందని ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం గురువారం పట్టణంలోని పవిత్ర ఫంక్షన్ హాలులో పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ నేతలు హామీల అమలును తుంగలో తొక్కి ఇదేమని ప్రశ్నిస్తున్న ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల చేత అక్రమ కేసులు పెట్టించి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఈ వేధింపులు ఎన్నాళ్లోసాగవని, పోలీసులు, ప్రజలు మీపై తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పథకాలు అమలుచేయలేక ప్రభుత్వం చేతులెత్తేసి అక్రమ కేసులతో డైవర్ట్ రాజకీయాలకు తెరతీస్తోందన్నారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తల ఊపు చూస్తుంటే విజయయాత్రకు వచ్చినట్లుందన్నారు.

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ధర్మపాలన ఎలాఉంటుందో నాడు జగన్‌మోహన్‌రెడ్డి చూపించారని, దుర్మార్గపు పాలన ఎలాఉంటుందో నేడు టీడీపీ నాయకులు చూపిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఓటమి ప్రజా తీర్పుతో వచ్చింది కాదని దీనికి నిదర్శనం ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఎన్నికలు అన్నారు. మహారాష్ట్రలోని ఓగ్రామం మొత్తం దాదాపు కాంగ్రెస్‌కు ఓటువేయగా అక్కడ కాంగ్రెస్‌పార్టీకి సున్నా ఓట్లు వచ్చినట్లు ఈవీయంలలో ఉండటం, నేటికీ వారు ఆందోళన చేస్తుండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. టీడీపీవారి చర్యలకు ప్రతిచర్య ఉంటుందని చెప్పారు. సోషల్‌మీడియా యాక్టివిస్టుల పేరుతో అక్రమ అరెస్టులు పిరికి చర్య అన్నారు. బయటి నుంచి ఎంపీ అభ్యర్థిగా వచ్చిన తనకు కనిగిరి నియోజకవర్గంలో 11 వేల పైచిలుకు మెజారిటీ ఇచ్చారని, ఎప్పుడూ రుణపడిఉంటానన్నారు. కార్యకర్తకు చిన్న కష్టంవచ్చినా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షునిగా తాను అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, ఇన్‌చార్జ్ కూడా కార్యకర్తలు ప్రజల్లో మమేకమై పనిచేయాలని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన వ్యక్తి ఎమ్మెల్యే అయితేనే జగన్‌మోహన్ రెడ్డి సీఎం అవుతారని ఆమేరకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలన్నారు. టీడీపీ నాయకులు దమ్ము ధైర్యం ఉంటే ఇచ్చిన హామీలు అమలు చేశామని ఇంటింటికీ వెళ్లి చెప్పాలన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీదే విజయం అని సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టడం తథ్యమని అన్నారు. పార్టీకి కార్యకర్తలే బలం అని, వారికి ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ సామాన్యుడినైన తనకు సామాజిక వర్గ సమీకరణలో భాగంగానే కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాడు బరిలో నిలిపారన్నారు. కొద్ది రోజుల్లోనే తనకు 93 వేల ఓట్లు వచ్చాయని, దీనికి కృషిచేసి ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని చెప్పారు. అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలతోనే టీడీపీ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గత ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించి, టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని గత ఓటమిని వదలి ఇన్‌చార్జ్‌గా డాక్టర్ దద్దాల అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలతో కలిసి భవిష్యత్‌పై చర్చించి వారితో మమేకమై పార్టీ పరిష్టతకు, కార్యకర్తల కోసం పనిచేయాలని సూచించారు. కష్టపడి పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో లక్ష మెజారిటీతో కనిగిరి ఎమ్మెల్యేగా గెలుపు తథ్యమని భరోసానిచ్చారు. ప్రతి కార్యకర్త ఓ సైనికునిగా టీడీపీ ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టాలని కోరారు.

రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో గద్దెనెక్కి నేడు పథకాల అమలును విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. రెడ్‌బుక్ పేరుతో వేధింపులు సిగ్గుచేటని వేధింపులు ఆపి పథకాల అమలు, పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు.

కార్యక్రమంలో పీడీసీసీబీ మాజీ చైర్మన్ వై.యం.ప్రసాదరెడ్డి, కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్.అబ్దుల్ గఫార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, నియోజకవర్గంలోని ఆరుమండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీ, సర్పంచ్, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

రైతులపై చంద్రబాబు చిన్నచూపు

- నేడు కలెక్టరేట్ వద్ద నిరసన
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, చుండూరి రవిబాబు తదితరులు

ఒంగోలు సిటీ: కల్లబొల్లి మాటలు చెప్పి ఎన్నికల ముందు అలివిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రైతుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు 'అన్నదాతకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా వర్షాలు కురవడంతో రైతులు చాలా నష్టపోయారని తెలిపారు. అయినా ఇప్పటి వరకు రైతులకు ఎలాంటి సహాయం అందించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ అంటూ రైతులకు రూ.20 వేలు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రభుత్వం రైతులకు ఇన్సూరెన్స్ చేయకపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ హయాంలో వర్షాలు కురిసినప్పుడు కేవలం పదిహేను రోజుల వ్యవధిలోనే రైతులకు పంట నష్ట పరిహారం అందించినట్లు గుర్తు చేశారు. జగనన్న హయాంలో ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించడం, సొసైటీల ద్వారా సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతులకు అండగా ర్యాలీ చేస్తున్నామని ప్రకటించగానే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. కేవలం ఒకటి రెండు చోట్ల మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నారని, అది కూడా సొంత వ్యక్తులను దళారులుగా పెట్టుకొని రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మద్దతు ధర రూ.1780 లు ఇవ్వాల్సి ఉండగా తేమశాతం ఎక్కువగా ఉందని సాకులు చెబుతూ రూ.1350 నుంచి రూ.1400 లు మాత్రమే రైతుల చేతిలో పెట్టి దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని వల్ల రైతులు ఎకరాకు రూ.15 వేలు నష్టపోతున్నారన్నారు.

రైతులకు మద్దతుగా శుక్రవారం అంబేడ్కర్ భవనం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ కార్యక్రమం తలపెట్టామన్నారు. ఈ ర్యాలీలో రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. త్వరలో జెడ్పీ చైర్మన్ కి ఎసరు అంటూ జిల్లాలో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. జెడ్పీ చైర్మన్‌ను పదవి నుంచి దింపడం ఎవరి వల్ల కాదన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయరన్నారు. ప్రజా సమస్యలను చూపించాల్సిన మీడియా అవాస్తవాలు, అభూత కల్పనలతో పిచ్చిరాతలు రాయొద్దని హెచ్చరించారు. పార్టీ క్యాడర్ అంతా మాతోనే ఉందన్నారు. నేడు జరగబోయే వైఎస్సార్‌సీపీ రైతు పోరుబాట విజయవంతం చేయాలన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఆరు నెలలుగా వర్షాలు కురవడంతో వరి తడిసి నాని మొక్కలు వచ్చాయని, మొక్కజొన్న, పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు నిండా మునిగి నష్టంలో కూరుకుపోతే చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. జగనన్న హయాంలో ఏడాదికి రూ.13,500 లు ఇచ్చి వారిలో భరోసా నింపారని, ఏడాదికి రూ.20 వేలు ఇస్తానన్న చంద్రబాబు ఒక్క నయాపైసా కూడా ఇవ్వలేదన్నారు. మూడు రోజుల నుంచి పచ్చ పత్రికలో జెడ్పీటీసీలు వెళ్లిపోతున్నారని తప్పుడు కథనాలను వండివారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలిచిన మూడు సంవత్సరాల తర్వాత ఏదో యాత్రకు తీసుకెళతానని ముందే చెప్పానని ఇచ్చిన మాట ప్రకారం జెడ్పీటీసీ లను, వారి కుటుంబ సభ్యులను యాత్రలకు తీసుకొని వెళితే అసత్య కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. 55 మంది జెడ్పీటీసీలు ఇప్పటికీ తన వెంటే ఉన్నారని, ఓ పత్రికలో మాత్రం ఒక రోజు 29 మంది వెళ్లిపోయారని, మరోరోజు 9 మంది మాత్రమే పార్టీ మారారని తప్పుడు రాతలు రాస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీలో నుంచి వెళ్లిపోయిన వారెవరో తనకు చూపించాలన్నారు. తాను జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎంపికైన తర్వాత ఎంతో మందికి కారుణ్య నియామకాలు ఇప్పించానని, వారి వద్ద నుంచి ఒక్క నయాపైసా కూడా తీసుకోలేదన్నారు. జెడ్పీటీసీ లను బలవంతంగా తాడేపల్లికి తీసుకెళ్లినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి అవసరం తమకు లేదని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, బొట్ల సుబ్బారావు, బదుగు ఇందిర, భూమిరెడ్డి రవణమ్మ మేరికుమారి, ప్రసన్న, మీరావలి, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నేతలు వల్లెవేసిన హామీలు అటకెక్కాయి. నాడు అరచేతిలో వైకుంఠం చూపిన నేతలంతా గద్దెనెక్కగానే గప్ చుప్ అయ్యారు. సూపర్ సిక్స్ అమలు చేస్తాం.. అందుకోసం సంపద సృష్టిస్తామంటూ బీరాలు పలికిన గొంతులు ఇప్పుడు పెగలడం లేదు. 'సూపర్ సిక్స్ హామీలిచ్చాం. చూస్తుంటే భయమేస్తోంది' అంటూ ఇటీవల అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు పేద, మధ్య తరగతి ప్రజలను డైలమాలో పడేశాయి. కూటమి పాలన మొదలై ఆరు నెలలు గడిచినా.. ఎన్నికల హామీల అమలుపై సాగదీత ధోరణితో వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు విమర్శలు, వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సాగుతున్న ఆటవిక పాలన, సంక్షేమం కరువై పేదలు పడుతున్న వేదనపై గళం వినిపించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోరుబాటకు సిద్ధమయ్యారు.

- సూపర్ సిక్స్ పేరుతో శఠగోపం పెట్టారని పేదల గగ్గోలు
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాలు నిర్వీర్యం
- పథకాలను పేర్లు మార్చి ఆపై అటకెక్కించిన వైనం
- మాటల్లో తప్ప చేతల్లో కనిపించని పేదల ఇళ్లు, అభివృద్ధి పనులు
- సూపర్‌సిక్స్ హామీలిచ్చాం.. చూస్తుంటే భయమేస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు
- జగన్ ఉండి ఉంటే ఇప్పటికే పథకాలు అంది ఉండేవంటున్న ప్రజలు
- సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి మరీ పథకాలు అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, ప్రభుత్వం చేస్తున్న ప్రజా వంచనపై వైఎస్సార్ సీపీ పోరుబాట



గద్దెనెక్కి.. గప్‌చుప్!

జనాన్ని ఏమార్చుతూ.. సంక్షేమాన్ని మరిచిన కూటమి సర్కారు

పథకాలపై చర్చ లేకుండా డైవర్షన్ పాలిటిక్స్

సూపర్‌సిక్స్ పథకాల అమలుపై ఆలోచిస్తుంటే భయమేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల అసెంబ్లీలో చర్చ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు హామీల అమలుపై సర్కారు తీరును చెప్పకనే చెప్పేశాయన్న చర్చ సాగుతోంది. పైగా పథకాల అమలుపై ప్రజల్లో చర్చ లేకుండా చేసేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు కూటమి ప్రభుత్వం తెరతీసింది. కృష్ణా నదిలో బోట్లు, జత్వానీ, తిరుమలలో కల్తీ లడ్డు, రేషన్ దందా అంటూ ప్రజల దృష్టి మరల్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా వైఎస్సార్ సీపీపై మాటల యుద్ధమే తప్ప సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. రాష్ట్రంలో పరిణామాలు ఎప్పటికప్పుడు గమనిస్తున్న ప్రజలు 'జగన్ ఉండి ఉంటే.. అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలన్నీ వరుసగా అందేవి' అని చర్చించుకుంటున్నారు.

ఒంగోలు అర్బన్:

'జనాన్ని మాటలతో మాయ చేయడం, నమ్మి ఓటేసిన తర్వాత నట్టేట ముంచడం సీఎం చంద్రబాబునాయుడికి వెన్నతో పెట్టిన విద్య' ఎక్కడ చూసినా ఇప్పుడు ఇవే మాటలు వినిపిస్తున్నాయి. సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు అండ్ కో గడిచిన ఆరు నెలలుగా రాష్ట్రంలో ఏదో ఒక అంశాన్ని చర్చకు వచ్చేలా చూడటం.. ఆపై మాటల దాడి చేయడం పరిపాటిగా మారింది. సంక్షేమ పథకాలపై జనం ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో ఎప్పటికప్పుడు అస్పష్ట ప్రకటనలు గుప్పిస్తున్న తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

ఒక ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పథకం ద్వారా అందిస్తామని ఎన్నికల సమయంలో ప్రచారాన్ని హోరెత్తించిన కూటమి నాయకులు గద్దెనెక్కిన తర్వాత కిమ్మనడం లేదు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం గురించి పరిశీలిస్తున్నామని, ఇప్పుడు అమలు చేయలేమంటూ చేతులెత్తేశారు. ఇవే కాకుండా రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు ప్రతి నెలా రూ.1500, రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి హామీలను అటకెక్కించేశారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని సైతం సక్రమంగా అమలు చేయకుండా ఈ ఏడాదికిగాను ఒక సిలిండర్‌కే పరిమితం చేయడం 'కూటమి' సర్కారు మోసాన్ని తేటతెల్లం చేసింది.

చతికిలపడ్డ వైద్య రంగం

కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 పేరుతో ఓ ప్రణాళికను రూపొందించి ఊహల్లో అభివృద్ధిని చూపేందుకు యత్నిస్తోంది. అయితే కూటమి నిర్దేశించుకున్న అన్ని రంగాల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారు. ఉదాహరణకు వైద్య రంగంలో వైద్యుల నుంచి పారామెడికల్ పోస్టుల వరకు వేలాది ఉద్యోగాలు భర్తీ చేసి మెరుగైన సేవలు అందించారు. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ఇంటింటికీ వైద్య సేవలు దగ్గర చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా భవిష్యత్తులో స్పెషలిస్టు డాక్టర్ల సంఖ్యను పెంచి పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఏకంగా 17 వైద్య కళాశాలలు నెలకొల్పారు. అందులో మార్కాపురం మెడికల్ కాలేజీ ఒకటి. కూటమి సర్కారు ఆ కాలేజీని నిలిపేసి పేద విద్యార్థుల కలలను చిదిమేసింది. ఇంటింటికీ వైద్యాన్ని నిలిపేసింది. అత్యవసర మందుల సరఫరాకు కొర్రీలు వేస్తోంది. ఆరోగ్యశ్రీ సేవలను పేదలకు దూరం చేసి రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల వైపు చూసేలా బలవంతపు చర్యలకు పాల్పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తల్లికి వందనం.. ఎగనామం

విద్యా రంగంలో గత ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా రూ.వందల కోట్లు కేటాయించి పాఠశాలల రూపురేఖలు మార్చింది. విద్యార్థులకు స్కూల్ డ్రెస్ నుంచి బూట్లు, డిజిటల్ క్లాస్ రూములు, నాణ్యమైన పౌష్టికాహారం వంటి సౌకర్యాలు ఉచితంగా కల్పించడంతో పాటు అమ్మఒడి పథకం ద్వారా తల్లులకు ఏడాదికి రూ.15 వేలు అందజేసింది. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అస్పష్ట ప్రకటనలకే పరిమితమైంది.

రైతులకు భరోసా ఏదీ?

వ్యవసాయ, అనుబంధ రంగాలకు వైఎస్సార్ సీపీ పాలన స్వర్ణ యుగంలా నడిచింది. రైతు భరోసా పథకంతో ఏటా పెట్టుబడి సాయం అందించడంతోపాటు పంట ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను అక్కున చేర్చుకుంది. కూటమి ప్రభుత్వంలో రబీ, ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి సాయం అందక రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఈ ప్రభుత్వంలో లబ్ధిపొందాల్సిన వారి వివరాలు



ఉచిత బస్సు ప్రయాణం
లబ్ధిదారులు
11,02,821



మూడు గ్యాస్ సిలిండర్లు
లబ్ధిదారులు
6,44,126



తల్లికి వందనం
లబ్ధిదారులు
2,89,783
చెల్లించాల్సిన మొత్తం
రూ 434,67,40,000



నిరుద్యోగ భృతి
లబ్ధిదారులు
2,08,350
చెల్లించాల్సిన మొత్తం
రూ 62,50,50,000



మహిళలకు (1500)
లబ్ధిదారులు
7,00,012
చెల్లించాల్సిన మొత్తం
రూ 1,05,00,18,000



అన్నదాత సుఖీభవ
లబ్ధిదారులు
2,96,889
చెల్లించాల్సిన మొత్తం
రూ 593,77,80,000



వైఎస్ జగన్ సంక్షేమ బావుటా

మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి, ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. ఏ పథకం ఎప్పుడిస్తారో చెబుతూ తేదీల వారీగా క్యాలెండర్‌ను ప్రకటించి సంక్షేమాభివృద్ధిని కాంక్షించిన చరిత్ర వైఎస్ జగన్‌ది. కులమతాలు చూడకుండా, రాజకీయాలు చేయకుండా సంక్షేమ పథకాలను అర్హుల గుమ్మం ముందుకే చేర్చి దేశానికే ఆదర్శంగా నిలిచారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు డీబీటీ పథకాల రూపంలో రూ.12,410.20 కోట్లు, నాన్ డీబీటీ పథకాల రూపంలో రూ.3,732.59 కోట్లు అందించి నవ చరిత్ర లిఖించారు.

జిల్లాలో సంక్షేమ లబ్ధి వివరాలు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
డీబీటీ		
జగనన్న అమ్మ ఒడి	2,09,776	1249.47
వైఎస్సార్ ఆసరా	3,08,258	937.96
వైఎస్సార్ చేయూత	119314	593.70
జగనన్న విద్యా దీవెన	13624	54.49
జగనన్న వసతి దీవెన	12341	49.36
నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు	73993	1331.87
వైఎస్సార్ సున్నావడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	420980	245.68
వైఎస్సార్ కాపు నేస్తం	8,707	48.88
ఈబీసీ నేస్తం	39,409	172.02
కళ్యాణమస్తు షాదీతోఫా	1,901	16.91
వైఎస్సార్ పెన్షన్ కానుక	2,97,558	4984.01
వైఎస్సార్ రైతు భరోసా	2,84,113	1634.85
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	197966	492.52
వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీ	50378	23.27
జగనన్న చేదోడు	194868	197.51
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	99588	60
వైఎస్సార్ నేతన్న నేస్తం	769	7.94
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	420980	245.68
వైఎస్సార్ వాహనమిత్ర	10176	64.08
నాన్ డీబీటీ		
జగనన్న తోడు	18497	55.49
వైఎస్సార్ జగనన్న ఇళ్ల పట్టాలు	66325	3059.68
జగనన్న గోరుముద్ద	200692	166.52
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	152384	285.42
జగనన్న విద్యా కానుక	217080	165.48
డీబీటీ+నాన్ డీబీటీ లబ్ధి		16,142.79

తల్లిదండ్రులకు కడుపు కోత

- శ్రీకాకుళం జిల్లాలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మృతుడిది పుల్లలచెరువు మండలం పీఆర్‌సీ తండా

ఎచ్చెర్ల క్యాంపస్ (శ్రీకాకుళం): పరిగెడుతూ పడిపోతేనే ఆ దెబ్బలకు తాళలేరు. ఆ అబ్బాయి మూడో అంతస్తు నుంచి దూకేశాడు. ఎంత వేదన అనుభవించాడోగానీ చనిపోదామని నిశ్చయించుకుని దూకేసినా.. కొనఊపిరితో ఉన్నప్పుడు బతకాలని ఆశపడ్డాడు. »నన్ను బతికించండి.. నన్ను బతికించండి.. ప్లీజ్..« అంటూ స్నేహితులు, వైద్యులను వేడుకున్నాడు. కానీ, ఆ బిడ్డ ప్రాణం నిలబడలేదు. తల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తూ బంగారం లాంటి బతుకును బలి చేసుకున్నాడు. శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ కాలేజీలో చదువుతున్న ఆర్. ప్రవీణ్ నాయక్ (18) బుధవారం అర్ధ రాత్రి బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి స్వస్థలం ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలం పీఆర్‌సీ తండా. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...

శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం ఎస్ఎం పురం క్యాంపస్‌లో బుధవారం అర్ధరాత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న విద్యార్థులకు ఒక్క సారిగా శబ్ధం వినిపించింది. వారంతా వచ్చి చూడగా ప్రవీణ్ నాయక్ రక్తం మడుగులో కనిపించాడు. వెంటనే అతడిని క్యాంపస్ అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు సిబ్బంది తీసుకెళ్లారు. అత్యవసర విభాగంలో వైద్యం అందిస్తుండగా విద్యార్థి మృతి చెందాడు. ఘటన జరిగిన వెంటనే క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ ఆస్పత్రికి వెళ్లారు. విద్యార్థి తల్లిదండ్రులు రవీంద్ర నాయక్, విజయాబాయిలకు ఫోన్ చేసి చెప్పారు. 2021లో ఈ విద్యార్థి ఇక్కడ చేరాడు. రెండేళ్ల పీయూసీ విజయవంతంగా పూర్తిచేసుకున్నాడు. సివిల్ ఇంజినీరింగ్‌లో చేరి చక్కగా చదువుకుంటున్నాడు. పరీక్షల్లో మంచి మార్కులు



ప్రవీణ్ నాయక్ (ఫైల్)

కూడా సాధిస్తున్నాడు. ఆత్మహత్య చేసుకోవడాన్ని స్నేహితులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విద్యార్థి మూడో బ్లాక్‌లో ఏడుగురు విద్యార్థులతో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. పిల్లలంతా తమకు నచ్చినంతసేపు రాత్రి చదువుకుంటారు. అనంతరం నిద్రపోతారు. ప్రవీణ్ నాయక్ వాష్ రూమ్‌కు వెళ్తానని చెప్పి పోర్టుకో కిటికీలో నుంచి దూకేశాడు. తీవ్ర గాయాలతో ఉన్న విద్యార్థికి సహచరులు సపర్యలు చేస్తుంటే తనను బతికించాలని కోరాడు. ఆస్పత్రిలో సైతం బతికించండి సార్ అంటూ వేడుకున్నాడు. కానీ, అప్పటికే తీవ్రంగా రక్తస్రావం కావడంతో చనిపోయాడు. ఘటనపై సమాచారం అందుకున్న శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, జేఆర్ పురం సీఐ అవతారం, ఎస్ఐ సందీప్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సైతం పరిశీలించింది. విద్యార్థి మృతికి మంత్రి అచ్చెన్నాయుడు సంతాపం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక అధికారులతో మాట్లాడారు. ఇదే క్యాంపస్‌లో విజయనగరం నెల్లిమర్లకు చెందిన ఒక విద్యార్థిని రెండేళ్ల క్రితం మృతి చెందింది. ప్రస్తుత సంఘటన నేపథ్యంలో విద్యార్థులు ఆందోళన చెందగా, సిబ్బంది కౌన్సెలింగ్ ఇస్తున్నారు. విద్యార్థి మృతిపై కేర్‌టేక్ శాంతారావు ఫిర్యాదు చేశారు.

ప్రేమ వ్యవహారమే కారణం : డీఎస్పీ

ప్రేమ వ్యవహారం కారణంగానే ప్రవీణ్‌నాయక్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని డీఎస్పీ సీహెచ్ వివేకానంద స్పష్టం చేశారు. గూనపాలెంలోని పోలీస్ సబ్‌డివిజనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రవీణ్ నాయక్ ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు తెలిసిందని డీఎస్పీ తెలిపారు. ప్రేమించే సమయం ఇది కాదని, చదువుకుందామని ఆమె చెప్పడంతో భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. ప్రవీణ్ ఉండే రూమ్‌లో ఓ అబ్బాయి బయటకువెళ్లి రాకపోవడంతో తలుపులు తీసి ఉంచారని, అప్పటికే మిగతావారితో కలిసి పడుకుని ఉన్న ప్రవీణ్ రాత్రి 1:30 సమయంలో లేచి తలుపు తోసుకుని బయటకు వెళ్లినట్లు విద్యార్థులు చెప్పారన్నారు. కొద్ది క్షణాల్లోనే మూడో అంతస్తు కిటికీ నుంచి ప్రవీణ్‌నాయక్ దూకేశాడని తెలిపారు. విద్యార్థులు, కేర్ టేకర్లు కలిసి విద్యార్థిని రిమ్స్‌కు తీసుకెళ్లారని, బ్లీడింగ్ ఎక్కువగా కావడంతో 2.30కు ప్రాణాలు విడిచాడని వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి మరణం కలచివేసింది

- ఆ దుర్ఘటనపై సమగ్రంగా దర్యాప్తు జరపాలి
- ప్రభుత్వం బాధ్యత వహించాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: శ్రీకాకుళం జిల్లా వెచ్చర్ల నియోజకవర్గంలోని ట్రిపుల్ ఐటీ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలం పీఆర్సీ తండాకు చెందిన రమావత్ ప్రవీణ్‌నాయక్ అనుమానాస్పదంగా మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడారు. గిరిజన ఆశాకిరణమైన ఆ విద్యార్థి మరణంతో బడుగుల అభివృద్ధికి తీరని నష్టం వాటిల్లినట్లేనని అన్నారు. ఎన్నో ఆశలతో ఆ బిడ్డను కష్టపడి చదివిస్తూ తమ ఉత్తమ భవిష్యత్ కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఇటువంటి సంఘటన జరగడంతో ఆ కుటుంబం కోలుకోలేని పరిస్థితిలో ఉందన్నారు. వారికి న్యాయం జరగాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని, విద్యాశాఖామంత్రి లోకేష్ తన శాఖకు న్యాయం చేయకుండా ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలలో, ఇతర శాఖలపై దృష్టిపెడుతున్నారని విమర్శించారు. విద్యావ్యవస్థలో బయట పడుతున్న అనేక అంశాలే అందుకు నిదర్శనమన్నారు. ఇటువంటి పరిస్థితులను చూస్తుంటే విద్యార్థుల భవిష్యత్తుపై చీకటి పొరలు కమ్ముకున్నట్లుగా అనిపిస్తోందన్నారు. పేద గిరిజన కుటుంబంలో జన్మించిన ఆ బిడ్డ శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో తన మేధస్సుతో సీటు సాధించాడని, తమ కుటుంబానికి, తన భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటాడని ఆశించిన ప్రవీణ్‌నాయక్ తల్లిదండ్రులకు ఈ కూటమి ప్రభుత్వం ఏ విధంగా సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ఈ దుస్థితికి ప్రధాన కారణం కచ్చితంగా ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అన్నారు. విద్యావ్యవస్థలో భద్రత లోపించడం వలనే ఈ సంఘటన చోటుచేసుకుందని ఎమ్మెల్యే మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి ఈ ఘటనకు కారకులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని, ఆ విద్యార్థి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎమ్మెల్యే తాటిపర్తి డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

ఒంగోలులో సినీ నటి శ్రీలీల సందడి



సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి శ్రీలీల

- సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం


ఒంగోలు టౌన్: నగరంలో సినీనటి శ్రీలీల గురువారం సందడి చేశారు. దెబ్బలు పడతయి రాజా..దెబ్బలు పడతయిరో... అంటూ ఇటీవల పుష్ప–2లో ఐటెం సాంగ్‌తో ఒక ఊపు ఊపిన శ్రీలీలను చూసేందుకు యువత ఎగబడ్డారు. నగరంలోని కర్నూలు రోడ్డులో బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ప్రత్యేక అతిథిగా శ్రీలీల హాజరై ఆకర్షణగా నిలిచారు. రిబ్బన్ కట్ చేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ ఒంగోలు ప్రజలను నూతన వస్త్ర ప్రపంచంలోకి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తీసుకెళ్తుందన్నారు. రాబోయే క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగలకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో దుస్తులు కొనుగోలు చేసి ఆస్వాదించాలని కోరారు. చిన్నారుల నుంచి యువతీ యువకులు, అన్ని తరగతుల వారికి నచ్చే మెచ్చే దుస్తులు ఇక్కడ లభిస్తాయని చెప్పారు. తొలుత సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సంస్థ డైరెక్టర్లు సురేష్ సీర్ల, అభినయ్, రాకేష్, కేశవ్‌లు అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒంగోలులో 38వ బ్రాంచ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఒంగోలు ప్రజలు కోరుకునే నాణ్యత, నవ్యతకు పెద్ద పీట వేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే ఎన్.విజయకుమార్, నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ వేమూరి భవాని తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై కఠినంగా వ్యవహరిస్తాం

- ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల మండలాల్లోని బెల్టుషాపులు, నాటుసారా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మార్కాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరెడ్డి పేర్కొన్నారు. పశ్చిమ ప్రకాశంలో అక్రమ మద్యం, గంజాయి, సారా విక్రయాలపై 'చర్యలే గమ్మత్తు.. జోరుగా మత్తు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

సీఐ మాట్లాడుతూ.. ఇప్పటికే అనుమానిత గ్రామాల్లో దాడులు చేశామని చెప్పారు. మార్కాపురం మండలంలో 11 మందిని అరెస్టు చేసి 132 మద్యం సీసాలు, పెద్దారవీడు మండలంలో 9 మందిని అరెస్టు చేసి 97 మద్యం సీసాలు, దోర్నాల మండలంలో ఇద్దరిని అరెస్టు చేసి 18 లిక్కర్ బాటిల్లు, 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని, 1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని వివరించారు. నాటుసారా గంజాయి విక్రయాలపై నిఘా పెట్టామని చెప్పారు. బెల్టు షాపులు, నాటుసారా తయారీ, గంజాయి అమ్మకాల సమాచారం తెలియజేయాలని కోరారు.